క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న రేణుకా గోపాలకృష్ణ, తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ రజక కాలనీలో గురువారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో రజక కాలనీ, వాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌టీఎల్ ఐల్యాండ్ పరిశీలన

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఎన్‌ఎస్‌టీఎల్ ఎదుట ఐల్యాండ్ ఏర్పాటు చేయనున్న ప్రతిపాదిత నమూనాను అధికారులతో కలిసి కార్పొరేటర్ బొమ్మిడి రమణ గురువారం పరిశీలించారు.

ఐల్యాండ్ ఏర్పాటు చేస్తున్న చోట హైమాస్ట్ లైట్, గ్రీనరీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎన్‌ఎస్‌టీఎల్ అధికారుల కోరిక మేరకు జీవీఎంసీ అధికారులతో కలసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం వార్డు పరిధిలోని బాజీ జంక్షన్ నుంచి వంశీ సూపర్ మార్కెట్ వరకు జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఎన్ఎస్‌టీఎల్ అధికారులు మధు కిరణ్, జీవీఎంసీ ఏఈ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సింథియా: దాన్ ఫౌండేషన్ సహకారంతో మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శ్రీహరిపురంలోని కొత్త రామాలయం వీధి కళాంజీయ సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో మహిళలకు ఉచిత గైనిక్ వైద్య పరీక్షలతో పాటు 25 ఏళ్లు పైబడిన మహిళలకు రొమ్ము, గర్భాశయ, తదితర క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. పొగాకు, గుట్కా, పాన్ మసాలా వంటి అలవాట్లు ఉన్న పురుషులకు వైద్యులు నోటి పరీక్షలు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం, మల్కాపురం చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భాగ్యలక్ష్మికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం



ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మికి అభినందనలు తెలుపుతున్న డాక్టర్ షీజా జనార్దన్

సింథియా: విద్య, యువజన, సామాజిక, సేవా రంగాల్లో విశేష కృషి చేస్తున్నందుకు జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. ఈ మేరకు వరల్డ్ బుక్ రికార్డు సంస్థ ఆన్‌లైన్‌లో ఆమెకు ప్రశంసా పత్రం పంపింది. జ్ఞాన అన్వేషణతో పాటు విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణంలో సామాజిక చైతన్యాన్ని కలిగించడంలో భాగ్యలక్ష్మి పాత్ర మరువలేనిదని, అందుకు ఈ ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్నామని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మికి ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ నేవల్ ఆర్కిటెక్చర్ విభాగాధిపతి డాక్టర్ షీజా జనార్దన్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

అభివృద్ధి, సంక్షేమంపై ఇంటింటి ప్రచారం



సమావేశంలో పాల్గొన్న ముఖ్యనేతలు



మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా పిలుపు
- 91వ వార్డు ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమావేశం

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం చేయాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. గురువారం గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో జీవీఎంసీ 91వ వార్డు ముఖ్య నేతలు, బూత్ లెవల్ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. లబ్ధిదారులు, తటస్తుల్ని ఆకట్టుకునే విధంగా పని చేయాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, పేదల అభ్యున్నతి గురించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్న తీరును ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, ప్రజల కష్టాలు గురించి కూడా సమగ్రంగా వివరించాలన్నారు. ఈ సమావేశంలో 91, 92 వార్డుల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, కన్వీనర్లు, గృహసారథులు, మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు



మందులు అందిస్తున్న గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, వైద్యుడు వికాస్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ పట్టణరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కొత్తపాలెం పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో స్థానికులు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి, ఎముకలు, జనరల్ ఫిజీషియన్, స్త్రీ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసి సలహాలు, మందులు అందించారు. శిబిరాన్ని 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు శిబిరాన్ని సందర్శించి సహాయ సహకారాలు అందించారు. స్థానికులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. చంద్రనగర్ అర్బన్ వైద్యాధికారి వికాస్ శిబిరానికి వచ్చిన వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. వైద్య పరీక్షలు అనంతరం మందులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు గవర నాయుడు, కిమిడి చరణ్, పాలమరశెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో శిక్షణ



మాట్లాడుతున్న కోరమాండల్ ఫెర్టిలైజర్స్ యాజమాన్య ప్రతినిధి

సింథియా: మహిళలు స్వయం ఉపాధి సాధించేలా పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కోరమాండల్ సంస్థ హెచ్‌ఆర్ డీజీఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు చెప్పారు. జీవీఎంసీ 58వ వార్డు ఎదురువానిపాలెంలో 30 మంది మహిళలకు జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో నిర్వహించనున్న శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిక్షణా కేంద్రాల వల్ల మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ మేనేజర్ నాగార్జున, సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోనంగి వెంకటరమణి, నాయకులు ఎదురు అప్పలస్వామి, ఎదురు రాజు, బాబి, కృష్ణ, కాటర రాజు తదితరులు పాల్గొన్నారు.

కోరమాండల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కోరమాండల్ గేటు వద్ద మాట్లాడుతున్న జీవీ సత్యనారాయణమూర్తి

సింథియా: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు గురువారం సంస్థ గేటు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కోరమాండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సీనియర్ నాయకుడు, ఏఐటీయూసీ విశాఖపట్నం పోర్ట్ ట్రేడ్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జీవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, జనరల్ షిఫ్ట్ టైమింగ్స్ గతంలో మాదిరిగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీనియర్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలని, క్యాంటీన్ సౌకర్యం మెరుగుపరచాలని కోరారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, మహాలక్ష్మి, కె.శంకర్, కె.సత్యనారాయణరెడ్డి, ప్రకాష్, జి.రాంబాబు, శ్రీను, శేఖర్, ప్రకాష్‌రెడ్డి, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

'కార్మికులను దెబ్బ తీసేందుకే ప్రైవేటీకరణ'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక శక్తిని పూర్తిగా దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1106వ రోజు, గురువారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు

కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు



కార్పొరేటర్ లక్ష్మణరావుకు సమస్యలను వివరిస్తున్న మహిళలు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని.. మరి కొన్ని పనుల కోసం ప్రణాళిక రూపొందించామని వార్డు కార్పొరేటర్ బల్లలక్ష్మణరావు చెప్పారు. ప్రకాష్‌నగర్, జనతాకాలనీలోని సమస్యలపై స్థానిక మహిళలు గురువారం జీవీఎంసీ కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావును ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వార్డును అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రణాళికలు రూపొందించిన పలు అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వార్డులో అధికశాతం కొండవాలు ప్రాంతాలే కావడం వల్ల టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. దీంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో ఆలస్యమవుతుందన్నారు. విషయాన్ని పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి అనుమానాస్పద మృతి



మృతుడు ప్రసాదరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి గురువారం అనుమానాస్పదంగా మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ క్యూఏటీడీ విభాగంలో ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న పరవాడ ప్రసాదరావు (45) టౌన్‌షిప్‌లో సెక్టార్-10 క్వార్టర్స్‌లో కుటుంబంతో నివసిస్తున్నారు. మధ్యాహ్నం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న తమ పిల్లలను స్కూల్ నుంచి ఇంటికి తీసుకు వచ్చారు. ఇంట్లోకి వెళ్లిన కొద్దిసేపటికి కుటుంబీకులు లోపల చూడగా అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే ఉక్కు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని మెడపై ఉన్న గాట్లను బట్టి మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించనున్నామని ఆయన తెలిపారు.

25న శ్రీ కృష్ణదేవరాయలు, రంగా విగ్రహాల ఆవిష్కరణ

డాబాగార్డెన్స్: విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధి గోపాలపట్నం పద్మనాభనగర్‌లో ఈ నెల 25న శ్రీ కృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా విగ్రహాల ఆవిష్కరణ నిర్వహించనున్నట్టు శ్రీకృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంట్రెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కంపర సత్తిబాబు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 92వ వార్డు పద్మనాభనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపానికి సుమారు రూ.2 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మంజూరు చేయించిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 25న ఆడారి అభినందన సభ ఏర్పాటు చేసినట్టు వారు వెల్లడించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 2018లో శంకుస్థాపన చేసిన కాపు భవన్ నిర్మాణం నిలిచిపోయిందని, కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు సహకారంతో ఆడారి ఆనంద్‌కుమార్‌తో చర్చించి ప్రభుత్వ నిధులు మంజూరు చేయించారన్నారు. సమావేశంలో సంఘం గౌరవ సలహాదారుడు గంట్ల శ్రీనబాబు, తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, విగ్రహ దాతలు సురేష్, శ్రీధర్ పలువురు సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.రాజశేఖర్, కె.నాగరాజు, డి.మోహన్, గేదల మురళీకృష్ణ, జి.నాగరాజు పాల్గొన్నారు.

మహిళల హక్కులు కాలరాస్తున్న కేంద్రం

- ఐద్వా ఆలిండియా ప్రధాన కార్యదర్శి మరియం థావలే



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఐద్వా ఆలిండియా ప్రధాన కార్యదర్శి మరియం థావలే

డాబాగార్డెన్స్: బీజేపీ ప్రభుత్వం మహిళల హక్కులు కాలరాస్తోందని, మోదీ ప్రభుత్వం పేదోల డబ్బులు దోచుకుని, అంబానీ, ఆదానీలకు ధారపోస్తోందని ఐద్వా ఆలిండియా ప్రధాన కార్యదర్శి మరియం థావలే ఆరోపించారు. మోదీకి రెండు నెలలే గడువుందని..రానున్న ఎన్నికల్లో మహిళలందరూ గుణపాఠం చెప్పనున్నారని ఆమె తెలిపారు. ఐద్వా అఖిల భారత జాతీయ సమావేశాలు విశాఖ వేదికగా ఈ నెల 25వరకు నిర్వహించనున్న సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం మధ్యాహ్నం నగరంలోని సరస్వతీపార్క్ నుంచి డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహ కూడలి, ఎల్ఐసీ జంక్షన్ మీదుగా వైఎస్సార్ సెంట్రల్ పార్క్ వరకు వివిధ కళా నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మరియం థావలేతో పాటు ఐద్వా ఆలిండియా కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, ప్రధాన కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర నాయకులు వై.సత్యవతి, బి.పద్మ, డాక్టర్ జి.ప్రియాంక, ఆర్.విమలతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో థావలే మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు 5 కేజీల బియ్యం రేషన్ డిపోల ద్వారా సరఫరా చేసి పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పడం సిగ్గుచేటన్నారు. దేశంలో విమానపు చార్జీలు, ఏసీ రైళ్ల చార్జీలు తగ్గించి, సాధారణ ప్రజలు ప్రయాణించే రైల్వే, బస్సు ఇతర రవాణా చార్జీలు భారీగా పెంచడాన్ని ఆమె తప్పుబట్టారు. పెట్రోల్, డీజిల, వంట గ్యాస్, విద్యుత్, ఇతర నిత్యావసర ధరలు భారీగా పెంచుతున్న మోదీ, జగన్‌లు కార్మికుల వేతనాలు మాత్రం పెంచడం లేదన్నారు. రైతులు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయని ప్రభుత్వాలు, ఆదాని, అంబానీల వంటి కార్పొరేట్ సంస్థలకు రూ.15 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందంటే ఈ ప్రభుత్వాలు ఎవరి పక్షాన ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. దేశంలో మహిళలపై లైంగిక దాడులు, హత్యలకు పాల్పడేవారిని మోదీ ప్రభుత్వం సన్మానాలు చేయడం దేశం తలదించుకునేలా చేసిందన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

మద్దిపాలెం: అతివేగంగా వెళ్తున్న ఆటో ఓ గుర్తు తెలియని మహిళను ఢీకొన్న ఘటన కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఈ నెల 17న సాయంత్రం 6 గంటల సమయంలో 28 బస్‌స్టాప్ నుంచి కంచరపాలెం మెట్టు ఆశీర్వాదం కల్యాణ మండపం వైపు ఏపీ31టీఈ2586 నంబర్ గల ఆటో అతివేగంగా వచ్చి రోడ్డుదాటుతున్న ఓ గుర్తు తెలియని మహిళను ఢీకొనడంతో ఆమె కింద పడిపోయింది. ఆమె తలకు బలమైన గాయమైంది. అక్కడ ఉన్నవారి సహాయంతో 108లో ఆమెను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. సమాచారం తెలిసిన వారు నేరుగా మృతదేహాన్ని చూసి తమను సంప్రదించాలని పోలీసులు కోరారు. స్థానిక వీఆర్‌వో ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ సీఐ ఎ.ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ అన్వర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

లంకెలపాలెం హైస్కూల్‌ను సందర్శించిన ఎల్ఐపీ బృందం



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న బృంద ప్రతినిధులు

అగనంపూడి: లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ఈపీ) రాష్ట్ర బృందం గురువారం పరిశీలించింది. పాఠశాలలో ఎల్ఐపీ అమలు తీరును బృంద ప్రతినిధులు పరిశీలించారు. బోధనా విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు అమలు జరుగుతున్న ఎల్ఈపీ కార్యక్రమంపై అలక్ష్యం, అశ్రద్ధ వహించవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమ నిర్వహణపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. కార్యక్రమంలో బృంద ప్రతినిధులు వై.వెంకట్‌రెడ్డి, అనకాపల్లి జిల్లా ఎస్ఎస్ఏ అకడమిక్ మానిటరింగ్ అధికారి మురళీ మోహన్ పట్నాయక్, పరవాడ మండల విద్యాశాఖాధికారి దివాకర్ రావు, పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'వార్వానివాస్' వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్

సీతమ్మధార: వార్వా నివాస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం 'వార్వానివాస్ డాట్ కాం' అనే వెబ్‌సైట్‌ను జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రారంభించారు. నగరం నలుమూలలా ఉండే అపార్ట్‌మెంట్ వాసులు, కాలనీ వాసులకు వార్వా నివాస్ సంఘం కార్యక్రమాలు, సందేశాలను సులువుగా చేర్చడం కోసం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు ప్రెసిడెంట్ ఎస్.ప్రకాశ్‌రావు తెలిపారు. ప్రజా సమస్యలు, సంఘ కార్యక్రమాలు, మ్యాగ్‌జైన్‌లు, డాక్యుమెంట్లు, విద్యా సంబంధిత కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాల సమాచారం తదతర అంశాలను పొందుపరిచినట్లు చెప్పారు. వార్వా నివాస్ తీసుకొచ్చిన వైబ్‌సైట్‌ను, సంఘాల కార్యక్రమాలను, ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ అభినందించారు. నగరంలోని పార్కులను అందంగా, ప్రజాహితంగా నడపడానికి వార్వా నివాస్ సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు పి.లచ్చిరాజు, జనరల్ సెక్రటరీ పిట్టా నారాయణమూర్తి, బి.బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న లక్ష్మి

సీతంపేట: మద్యం, గంజాయి, డ్రగ్స్, ఖైనీ, గుట్కా, బెట్టింగులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రగతిశీల మహిళా సంఘం గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ మనం ఎన్నికల జాతరలో ఉన్నామని, అభ్యర్థులు, పార్టీలు గతంలో హామీలు ఇచ్చేవారని, ఇపుడు ఎటువంటి హామీలు ఇవ్వడం లేదన్నారు. మహిళలపై హింస పెరగడంలో మద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి అత్యాచారాలు పెరుగుతున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకరమైన మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు విమల, సావిత్రి భాయి పూలే ట్రస్టు వ్యవస్థాపకురాలు గూడూరు సీతామాలక్ష్మి, హెచ్‌ఆర్‌యూఎఫ్ అనూరాధ, అరుణోదయ నిర్మల, అడ్వకేట్ గిరిధర్, ఇఫ్టూ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేవీలో ఘనంగా థింకింగ్ డే వేడుకలు



సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ తదితరులు

తాటిచెట్లపాలెం: పోర్ట్ గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఎదురుగా గల కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో వజ్జా మణిబాబు ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ థింకింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకులు లార్డ్ స్టీవెన్ సన్‌బాడెన్ పొవెల్, లేడీ బాడెన్ పొవెల్‌ల జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల్‌జీత్ బాడెన్‌లార్డ్ దంపతుల చిత్రపటానికి నివాళులర్పించారు. సంగీతం అధ్యాపకుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ నాట్స్, కుకింగ్, ప్రథమ చికిత్స, టెంట్ మేకింగ్, క్లే మౌల్డింగ్, పెయింటింగ్ వంటి అంశాలను ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్. మీనా, ప్రధానోపాధ్యాయిని శైలజ పాల్గొన్నారు.

మాతృభాషతో వ్యక్తిత్వ వికాసం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్

ఏయూ క్యాంపస్: వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష దోహదపడుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ తెలుగు విభాగంలో నిర్వహిస్తున్న తెలుగు భాష విశిష్టత సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేవలం మార్కుల కోసం తెలుగు భాషను చదవడం సరికాదన్నారు. మనోవికాసాన్ని పెంపొందించే శక్తి మాతృభాషకు ఉందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను మాతృభాషతో పరిరక్షించుకోవడం వీలవుతుందన్నారు. రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ రేవూరి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు చదివిన వారికి అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, సమైక్య భారతి సమన్వయకర్త పి.కన్నయ్య, జి.నాగేశ్వరరావు, డాక్టర్ బి.వెంకటస్వామి, విభాగ ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు.